ఓటింగ్‌లో ములుగును
మొదటి స్థానంలో నిలపాలి
కలెక్టర్ ఇలా త్రిపాఠి

ములుగు రూరల్, మార్చి 28 : వంద శాతం ఓటింగ్‌తో జిల్లాను మొదటి స్థానంలో నిలపాలని ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. గురువారం స్వీప్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ నుంచి గట్టమ్మ వరకు చేపట్టిన సైకిల్ ర్యాలీని అదనపు కలెక్టర్లు శ్రీజ, మహేందజీతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ఓటర్లందరు తమ ఓటు హక్కును వినియోగించుకొని పోలింగ్ శాతాన్ని పెంచాలన్నారు. అన్ని గ్రామాల్లో ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. 18 ఏళ్లు నిండిన వారు ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో శ్రీనివాస్‌కుమార్, జిల్లా మత్స్యశాఖ అధికారి శ్రీపతి, డీపీఎం సతీశ్, డీసీవో సర్దార్‌సింగ్, తహసీల్దార్ విజయ్‌భాస్కర్, చిన్నారులు, యువత, ఓటర్లు పాల్గొన్నారు.

సైకిల్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ

ములుగు రూరల్, మార్చి 28 : ములుగు జిల్లా కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను గురువారం ఎస్పీ డాక్టర్ పీ శబరీష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు తీరుపై ఆరా తీశారు. నాయకులు కోడ్ పాటించేలా స్థానిక స్టేషన్ హౌస్ అధికారులు చేపడుతున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు స్టేషన్‌లోని అధికారులు, సిబ్బందికి ఎన్నికలపై పలు సూచనలు చేశారు. పీఎస్ పరిధిలోని లైసెన్స్ ఆయుధాలను ఆధీనంలోకి తీసుకోవాలని, బెల్ట్ షాపులను మూసివేయాలని సూచించారు. ఎవరైనా రూల్స్‌కు విరుద్ధంగా ప్రవర్తిస్తే కేసులు నమోదు చేయాలని, ఇది అధికారులకు సైతం వర్తిస్తుందన్నారు. ఎస్పీ వెంట డీఎస్పీ రవీందర్, సీఐ రంజిత్‌కుమార్, ఎస్సై వెంకటేశ్వర్, సిబ్బంది ఉన్నారు.

పోలీస్ సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ శబరీష్

కామేశ్వరాలయ పునాది చుట్టూ కందకం తవ్వుతున్న కార్మికులు

రామప్ప సరస్సు కట్ట పైనున్న ఉపాలయాల రక్షణ కోసం నిర్మించిన గోడ

వడివడిగా రామప్ప అభివృద్ధి

- కామేశ్వరాలయ పనులు ప్రారంభం
- రూ.11 కోట్లతో పునర్నిర్మాణం
- 'ప్రసాద్'లో రూ. 63 కోట్లతో పనులు

వెంకటాపూర్, మార్చి 28 : ప్రపంచ వారసత్వ కట్టడమైన రామప్ప దేవాలయం అభివృద్ధికి వడివడిగా అడుగులు పడుతున్నాయి. ఎన్నో ఏండ్లుగా మూసుకుపోయి ఉన్న సోమసూత్ర ద్వారాన్ని ఇటీవల అధికారులు పునరుద్ధరించి వాడుకలోకి తీసుకురాగా కామేశ్వరాలయ పునర్నిర్మాణ పనులను రూ. 11 కోట్లతో ప్రారంభించారు. 2023 డిసెంబర్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కామేశ్వరాలయ పునర్నిర్మాణంతో పాటు ప్రసాద్ పథకంలో రూ.63 కోట్లతో చేపట్టే పనులకు శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే. కామేశ్వరాలయంతో పాటు తూర్పు ప్రహరీ పూర్తయితే రామప్పకు పూర్వవైభవం రానుందని పర్యాటకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ప్రసాద్ స్కీంలో చేపడుతున్న పనులు

రామప్పలో ప్రసాద్ పథకం ద్వారా రూ. 63 కోట్లతో కేంద్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో పార్కింగ్, టాయిలెట్స్ బ్లాక్, సావనీర్ షాప్స్, ఫౌంటెయిన్, చిల్డ్రన్స్ ప్లే ఏరియా, లాండ్ స్కేప్ ఫీచర్, ఎంట్రన్స్ ఆర్చ్ అండ్ సెక్యూరిటీ, ఇంటర్‌ప్రిటేషన్ సెంటర్, ఫుడ్ కోర్టులను 37 ఎకరాల స్థలంలో ఏర్పాటు చేయనున్నారు. ఇందులో 10 ఎకరాల్లో రూ. 42.14 కోట్లతో ఇంటర్ ప్రిటేషన్ సెంటర్, మల్టీ మోడల్ పార్కింగ్, ఫుడ్ కోర్ట్, ప్లే ఏరియా, మెడిటేషన్ సెంటర్, టాయిలెట్ కాంప్లెక్స్ పనులు జరుగుతున్నాయి. అలాగే 27 ఎకరాల్లో రూ. 9.48 కోట్లతో ప్రొమెనడ్ అండ్ గార్డెన్స్, థీమాటిక్ గార్డెన్స్, దేవాలయం వరకు పాత్‌వే, రూ. 3.35 కోట్లతో రామప్ప సరస్సు కట్ట సుందరీకరణ, స్నాక్ కౌంటర్స్, పార్కింగ్ ఏరియా, పాన్ ఏరియాలో రూ. 8.12 కోట్లతో డిస్‌ప్లే బోర్డులు, సీసీ టీవీ, జాతీయ రహదారి వద్ద స్వాగత తోరణం పనులు చేపట్టాల్సి ఉంది.

ప్రసాద్ పథకంలో నిర్మిస్తున్న భవనాలు

పునాది రాళ్ల తొలగింపు షురూ

కామేశ్వరాలయాన్ని గతంలోనే విప్పగా, పునాదిలో ఉన్న రెండు లేయర్ల రాళ్లను తీసేందుకు పురావస్తు శాఖ అధికారులు బుధవారం పనులు చేపట్టారు. రాళ్లు ఎంత లోపలి వరకు ఉన్నాయో చూడడంతో పాటు క్రేన్ సాయంతో వాటిని తొలగించడానికి మనుషులతో రెండు నుంచి మూడు అడుగుల మేర పునాది చుట్టూ కందకాలు తీయిస్తున్నారు.

ఉపాలయాలకు ప్రొటెక్షన్ వాల్

రామప్ప సరస్సు పక్కన హరిత హోటల్ వద్ద ఉన్న ఆలయాలను రాష్ట్ర పురావస్తు శాఖ ఆధ్వర్యంలో పునర్నిర్మాణం చేయాల్సి ఉండగా ఇటీవల అధికారులు వాటి చుట్టూ ప్రొటెక్షన్ వాల్ పనులు చేపట్టారు. సరస్సు నీటిమట్టం పెరిగినప్పుడు అలల తాకిడితో పాటు, వర్షాకాలం గుట్టపై నుంచి వచ్చే వరద నీటికి మట్టి కొట్టుకుపోకుండా దీనిని నిర్మిస్తున్నారు.

కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి

- అదనపు కలెక్టర్ మహేందర్‌జీ

ములుగు రూరల్, మార్చి 28 : ములుగు జిల్లాలో ఏప్రిల్ 1లోపు ధాన్యం కొనుగోలు కేంద్రాలను అధికారులు ప్రారంభించాలని అదనపు కలెక్టర్ మహేందర్‌జీ సూచించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో యాసంగి ధాన్యం కొనుగోలుపై ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులు, హమాలీలకు కనీస వసతులు ఏర్పాటు చేయాలన్నారు. ఏ గ్రేడ్ ధాన్యానికి రూ. 2,203, సాధారణ రకానికి రూ. 2,183 చొప్పున ప్రభుత్వ మద్దతు ధరకు కొనుగోలు చేసి డబ్బులను రైతుల ఖాతాల్లో జమ చేయాలన్నారు. సివిల్ సప్లై, అగ్రికల్చర్ అధికారులు పోలీసులతో సమన్వయం చేసుకొని ఇతర రాష్ట్రాల్లోని ధాన్యం జిల్లాలోకి ప్రవేశించకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో సివిల్ సప్లై జిల్లా మేనేజర్ రాంపతి, డీఆర్‌డీవో శ్రీనివాస్‌కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి విజయ్‌చంద్ర, డీసీవో సర్దార్‌సింగ్, గిరిజన సహకార సంస్థ జిల్లా మేనేజర్ ప్రతాప్‌రెడ్డి, మార్కెటింగ్ ఆఫీసర్ సుచరిత, సివిల్ సప్లై, అగ్రికల్చర్, అధికారులు, ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్లు, రైస్ మిల్లర్లు, పీటీసీ ఇన్‌చార్జిలు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మహేందర్‌జీ

ఏకరూప దుస్తులను సిద్ధం చేయాలి

- జూన్ 1లోగా పాఠశాలలకు అందించాలి
- సమీక్షలో అదనపు కలెక్టర్ శ్రీజ

ములుగు రూరల్, మార్చి 28 : పాఠశాలల విద్యార్థులకు ఏకరూప దుస్తులను సిద్ధం చేసి జూన్ 1 లోగా అందించాలని ములుగు అదనపు కలెక్టర్ శ్రీజ సూచించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో డీఆర్‌డీవో శ్రీనివాస్‌కుమార్‌తో కలిసి ఏకరూప దుస్తుల తయారీపై సమీక్ష నిర్వహించి మాట్లాడారు. ములుగు జిల్లాలోని ఒక్కో మండలాన్ని ఒక యూనిట్‌గా ఏర్పాటు చేసి మండల సమాఖ్య, గ్రామైక్య సంఘాలు, స్వయం సహాయక సంఘాల్లోని మహిళా సభ్యులకు కేటాయించినట్లు తెలిపారు. సభ్యులు ఎంపీడీవో, ఏపీవో, ఎంఈవోల ఆధ్వర్యంలో విద్యార్థుల కొలతలను ఏప్రిల్ 2 లోపు తీసుకొని, వివరాలను సంబంధిత అధికారులకు అందజేయాలని శ్రీజ ఆదేశించారు. డీఆర్‌డీవో శ్రీనివాస్‌కుమార్ మాట్లాడుతూ మొత్తం 62,402 ఏకరూప దుస్తులు అవసరమవుతాయని, వాటిని సిద్ధం చేసే బాధ్యతను జిల్లాలోని 3,894 స్వయం సహాయక సంఘాలకు అప్పగించినట్లు తెలిపారు. సమావేశంలో అదనపు డీఆర్‌డీవోలు వెంకటనారాయణ, బాలస్వామి, డీపీఎం సతీశ్, తొమ్మిది మండలాల ఎంపీడీవోలు, ఏపీఎంలు, ఈజీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీజ

చిన్న కాళేశ్వరం పనుల్లో
వేగం పెంచాలి

- గారెపల్లి విద్యుత్ ఉప కేంద్రాన్ని మేలోగా పూర్తి చేయాలి
- భూపాలపల్లి కలెక్టర్ భవేశ్‌మిశ్రా

భూపాలపల్లి రూరల్, మార్చి 28 : అదనపు ఆయకట్టు స్థిరీకరణకు చేపట్టిన చిన్న కాళేశ్వరం ప్రాజెక్ట్ పనుల్లో వేగం పెంచాలని కలెక్టర్ భవేశ్ మిశ్రా ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. గురువారం సమీకృత కలెక్టర్‌లో చిన్న కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు నీటిని తరలించి ఎర్రచెరువును నింపి అక్కడ నుంచి 12 చెరువులకు జలాల తరలింపుపై రెవెన్యూ, ఇరిగేషన్, విద్యుత్, మెగా కంపెనీ అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహదేవపూర్ మండలం బీరసాగర్ వద్ద గోదావరి నుంచి చిన్న కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు నీటిని తరలించేందుకు కాలువ నిర్మాణ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. చిన్న కాళేశ్వరం నుంచి 12 చెరువులకు నీరు అందించడం ద్వారా 45 వేల ఎకరాలు అదనంగా సాగులోకి వస్తాయన్నారు. మహదేవపూర్ వద్ద మందిరం చెరువుకు పైపులైన్ వేసేందుకు అడ్డంకిగా ఉన్న 19 గుంటల స్థల సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఇరిగేషన్, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. బీరసాగర్ వద్ద గోదావరి నుంచి పంప్‌హౌస్‌కు నీళ్లు మళ్లించడానికి చేపట్టనున్న పనులు రెండు నెలల్లో పూర్తి చేయాలన్నారు. మెగా కంపెనీ అధికారులు వారం రోజుల్లో పనులు ప్రారంభించాలని, గారెపల్లి వద్ద చేపట్టిన విద్యుత్ ఉపకేంద్రం నిర్మాణ పనులను మే నెలాఖరులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. వర్షాలు ప్రారంభమైతే పనులు పూర్తి చేయడానికి ఆటంకం కలుగుతుందని అన్నారు. జరుగుతున్న పనులపై ప్రతి రోజూ నివేదికలు ఇవ్వాలని సూచించారు. గత సంవత్సరం వర్షాలకు దెబ్బతిన్న గూడూరు, వీరాపురం, రుద్రారం చెరువుల మరమ్మతు పనులు త్వరగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఇరిగేషన్ ఈఈలు యాదగిరి, తిరుపతి, విద్యుత్ శాఖ అధికారి మల్సూర్, ఆర్డీవో మంగీలాల్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న భూపాలపల్లి కలెక్టర్ భవేశ్ మిశ్రా

ములుగు సబ్ రిజిస్ట్రార్‌గా భాస్కర్

ములుగు రూరల్, మార్చి 28 : ములుగు సబ్ రిజిస్ట్రార్‌గా భాస్కర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన సుజాత మహబూబాబాద్ జిల్లాకు బదిలీ కాగా ఆమె స్థానంలో ఉమ్మడి వరంగల్ జిల్లా రిజిస్ట్రేషన్ శాఖ ఆడిట్ కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్న భాస్కర్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆయనను డాక్యుమెంట్ రైటర్ల గౌరవ అధ్యక్షుడు ముంజాల భిక్షపతిగౌడ్ శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

బాధితురాలికి ఎల్వోసీ అందజేత

పలిమెల, మార్చి 28 : పలిమెల మండల కేంద్రానికి చెందిన జనగామ కవిత కీళ్ల వాతంతో బాధపడుతూ నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నది. ఈ విషయం రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకెళ్లగా వైద్య ఖర్చుల నిమిత్తం సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ. 2,50,000 ఎల్వోసీని మంజూరు చేయించి ఆమె కుటుంబ సభ్యులకు గురువారం అందించారు. సమయానికి స్పందించి సాయం చేసిన మంత్రికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

పీఏసీఎస్ వైస్ చైర్మన్‌పై వీగిన అవిశ్వాసం

మల్హార్, మార్చి 28 : తాడిచర్ల సింగిల్ విండో వైస్ చైర్మన్ మల్క ప్రకాశ్‌పై అదే పార్టీకి చెందిన కాంగ్రెస్ డైరెక్టర్లు ప్రవేశపెట్టిన అవిశ్వాసం వీగిపోయింది. పీఏసీఎస్‌లో 13 మంది డైరెక్టర్లు ఉండగా ఒక డైరెక్టర్ అనారోగ్యంతో మృతి చెందాడు. 12 మందిలో ఎనిమిది మంది డైరెక్టర్లు వైస్ చైర్మన్‌పై అవిశ్వాసం ప్రకటిస్తూ జిల్లా సహకార సంఘం అధికారి శైలజకు మార్చి 1న వినతిపత్రం ఇచ్చారు. ఈ నెల 28న అవిశ్వాసం ఏర్పాటు చేస్తూ డైరెక్టర్లకు నోటీసులు జారీ చేశారు. ఇందులో భాగంగా గురువారం డీసీవో శైలజ సంఘం కార్యాలయానికి ఉదయం 11 గంటలకు వచ్చారు. 11:30 గంటల వరకు వేచి చూసి పాలకవర్గ సభ్యులు ఎవరూ రాకపోవడంతో అవిశ్వాస సమావేశం రద్దు చేసి వీగి పోయినట్ల ప్రకటించారు.

జవాన్‌ను సన్మానిస్తున్న ఇన్‌స్పెక్టర్, తోటి జవానులు

సీఆర్‌పీఎఫ్ జవాన్‌కు ఘనంగా వీడ్కోలు

కాటారం, మార్చి 28 : సీఆర్‌పీఎఫ్ 58వ బెటాలియన్‌లో విధులు నిర్వర్తించి నెలాఖరులో ఉద్యోగ విరమణ పొందుతున్న కేరళకు చెందిన సురేశ్‌కుమార్‌కు ఘనంగా వీడ్కోలు పలికారు. కాటారం సీఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ రమణారెడ్డి, తోటి జవానులు గురువారం ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించి జ్ఞాపికను బహూకరించారు. సీఆర్‌పీఎఫ్‌లో దేశంలో ఎన్నో రాష్ట్రాల్లో విధులు నిర్వర్తించినా కాటారంలో పని చేయడం ఎంతో సంతృప్తినిచ్చిందని సురేశ్‌కుమార్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

తాడ్వాయి, మార్చి 28 : ఇసుక లారీ బైక్‌ను ఢీకొనడంతో యువకుడు అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటన గురువారం రాత్రి మండలకేంద్రంలోని 163వ జాతీయ రహదారిపై జరిగింది. వివరాలిలా ఉన్నాయి.. ఏటూరునాగారం మండలం ముళ్లకట్ట రాంపూర్ గ్రామానికి చెందిన కృష్ణారావు (24), బంధువు ఈసం మహేశ్ కలిసి బైక్‌పై బంధువుల పెళ్లి పత్రికలు పంచేందుకు పస్రా వైపునకు వెళ్లి రాత్రి 8 గంటలకు స్వగ్రామానికి బయలుదేరారు. మండలకేంద్రం దాటిన అనంతరం వారు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని ఎదురుగా వస్తున్న ఇసుక లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో కృష్ణారావు తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మహేశ్‌కు స్వల్ప గాయాలు కాగా వాహనదారుల సమాచారం మేరకు ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి, సిబ్బంది ఆస్పత్రికి తరలించారు.

చలివాగు వంతెన పనులు ప్రారంభించిన గుత్తేదారు

వంతెన పనులు ప్రారంభం

టేకుమట్ల, మార్చి 28; టేకుమట్ల–రాఘవారెడ్డిపేట గ్రామాల మధ్య చలివాగుపై వంతెన నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఇటీవల వంతెనను ఇంజినీర్ల బృందం, కాంట్రాక్టర్స్‌తో కలిసి చీఫ్ ఇంజినీర్ మోహన్‌నాయక్ వంతెన పరిస్థితిని పరిశీలించి, పనర్నిర్మాణం కోసం ప్రణాళిక రూపొందించారు. వెంటనే పనులు చేపట్టి జూన్‌లోపు పూర్తి చేసి వంతెనపై రాకపోకల చేపట్టాలని ఆదేశించారు. దీంతో సంబంధిత కాంట్రాక్టర్ గురువారం పనులను మొదలుపెట్టారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా వినయ్‌కుమార్

- ములుగులో ఏకగ్రీవంగా ఎన్నికలు

ములుగు, మార్చి 28 (నమస్తే తెలంగాణ) : ములుగు బార్ అసోసియేషన్‌ను సభ్యులు గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మస్రగాని వినయ్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా బజారు శ్యామ్‌ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా కన్నోజు సునీల్‌కుమార్, సంయుక్త కార్యదర్శులుగా రాదారపు శ్రీనివాస్, పీ రాం సింగ్ ఎన్నికయ్యారు. అలాగే మహిళా ప్రధాన కార్యదర్శిగా మేకల మానస, కోశాధికారిగా బానోత్ స్వామిదాస్, సాంస్కృతిక, క్రీడల కార్యదర్శిగా ఓరుగంటి రాజేందర్, ఈసీ మెంబర్లుగా బెక్కం నవత, బల్ల ప్రతాప్, సుస్మిత, సంజీవ, అశోక్‌తో పాటు ఎక్స్ అఫీషియో మెంబర్లుగా నర్సిరెడ్డి, చంద్రయ్య, వేణుగోపాలాచారిని ఎన్నుకున్నారు. అనంతరం జిల్లా కోర్టు ఎదుట న్యాయవాదులు సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు వినయ్‌కుమార్ మాట్లాడుతూ న్యాయవాదుల సమస్యలను పరిష్కరించడంలో ముందుంటానన్నారు. ప్రభుత్వం సమీకృత కలెక్టరేట్ పక్కన కేటాయించిన స్థలంలో పది కోర్టుల కాంప్లెక్స్ నిర్మాణానికి కృషి చేయనున్నట్లు తెలిపారు. తనపై నమ్మకంతో అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్న ములుగు న్యాయవాదులకు వినయ్‌కుమార్ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మేకల మహేందర్, రంగోజు భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులతో న్యాయవాదులు

భూపాలపల్లి అధ్యక్షుడిగా సురేశ్

కృష్ణకాలనీ : జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని కోర్టు ప్రాంగణంలో బార్ అసోసియేషన్ జిల్లా కమిటీ ఎన్నికలను గురువారం నిర్వహించారు. అధ్యక్షుడిగా కునూరు సురేశ్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా నిమ్మల విష్ణువర్ధన్, ప్రధాన కార్యదర్శిగా బల్ల మహేందర్, సహాయ కార్యదర్శిగా అక్షయ, కోశాధికారిగా సంగం రవీందర్, సభ్యులుగా ప్రశాంత్, అనిల్, కిరణ్, రాకేశ్ ఎన్నికయ్యారు.

కోరం లేక మండల సభ వాయిదా

మల్హార్, మార్చి 28 : మండలంలోని తాడిచర్ల ఎంపీడీవో కార్యాలయంలో గురువారం నిర్వహించిన మండల సభను కోరం లేకపోవడంతో వాయిదా వేసినట్లు ఎంపీడీవో శ్యామ్‌సుందర్ తెలిపారు. ఎంపీపీ చింతలపల్లి మలహల్‌రావు అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి ముగ్గురు ఎంపీటీసీలు హాజరుకావాల్సి ఉండగా ఎంపీపీతో పాటు వల్లెకుంట ఎంపీటీసీ నాగమణి మాత్రమే వచ్చారు. దీంతో కోరం లేక వాయిదా వేసినట్లు ఎంపీడీవో తెలిపారు.

విద్యుత్ తీగలు తగిలి యువకుడికి గాయాలు

వాజేడు, మార్చి 28 : మక్కజొన్న చేను వద్ద విద్యుత్ తీగలు తగిలి యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన బుధవారం అర్ధరాత్రి మండలంలోని చింతూరు గ్రామంలో జరిగింది. ఎస్సై వెంకటేశ్వర్‌రావు కథనం ప్రకారం.. గోవిందరావుపేట మండలం చల్వాయి గ్రామానికి చెందిన అభినయ్ ఇంటర్ పరీక్షలు ముగియడంతో అమ్మమ్మ ఊరు చెరుకూరుకు వచ్చాడు. ఇసుక తోలకం కోసం బుధవారం రాత్రి ట్రాక్టర్‌లో వెళ్లిన అభినయ్ చింతూరు వద్ద మలమూత్ర విసర్జనకు పక్కనే ఉన్న మక్కజొన్న చేను వద్దకు వెళ్లాడు. ఈ క్రమంలో అక్కడ అమర్చిన విద్యుత్ తీగలు తగిలి తీవ్ర గాయాలపాలయ్యాడు. బంధువులు అతడిని హనుమకొండలోని ప్రైవేట్ దవాఖానకు తరలించారు. యువకుడి బంధువు పునెం రామకృష్ణ ఫిర్యాదు మేరకు విద్యుత్ తీగలు అమర్చిన కన్నెబోయిన సమ్మయ్య, పూజారి సురేశ్‌పై కేసు నమోదు చేసి చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. విద్యుత్ శాఖ ఏఈ అర్షద్ అహ్మద్ సైతం నిందితులపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

రోడ్డు ప్రమాద బాధితుడికి పరామర్శ

మంగపేట, మార్చి 28 : ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మండలంలోని చుంచుపల్లికి చెందిన బీఆర్ఎస్ గ్రామ సోషల్ మీడియా ఇన్‌చార్జి బోడ శ్రీనును పార్టీ ములుగు జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు గురువారం పరామర్శించారు. కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. ఆయన వెంట పార్టీ మండలాధ్యక్షుడు కుడుముల లక్ష్మీనారాయణ, జిల్లా నాయకుడు కాకులమర్రి ప్రదీప్‌రావు, మండల ప్రధాన కార్యదర్శి గుండేటి రాజుయాదవ్, చిట్టిమల్ల సమ్మయ్య, చల్లగురుగుల తిరుపతి, రఘు, భాస్కర్, శ్రీహరి తదితరులున్నారు.


శ్రీనును పరామర్శిస్తున్న లక్ష్మీనర్సింహారావు

ఐదు ఫీట్లు సెట్ బ్యాక్ కావాలి

భవన నిర్మాణదారులకు బిల్ కలెక్టర్ల ఆదేశాలు

ములుగు, మార్చి28 (నమస్తే తెలంగాణ) : జిల్లా కేంద్రంలో నూతనంగా ఇల్లు నిర్మించుకునే యజమానులు రోడ్డు నుంచి ఐదు ఫీట్ల సెట్ బ్యాక్‌తో నిర్మాణాలు చేపట్టాలని గ్రామ పంచాయతీలోపనిచేసే బిల్ కలెక్టర్‌లు హుకుం జారీ చేస్తున్నారు. ఇందులో భాగంగా వారం రోజులుగా ప్లాట్ల యజమానులతో పాటు మేస్త్రీలు, బోర్‌వెల్ రిగ్ యంత్రాల యజమానులకు జీపీ అధికారులు ఫోన్లు చేసి సెట్ బ్యాక్ కాకుండా నిర్మాణాలు చేపడితే జీపీ ద్వారా చర్యలు చేపడుతామని హెచ్చరిస్తున్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు 20, 25ఫీట్ల రోడ్లతో వెంచర్లు చేసి ప్లాట్లు విక్రయించగా కొనుగోలు చేసిన యజమానులు ప్రస్తుతం ఐదు ఫీట్లు సెట్ బ్యాక్ కావాలనడంతో తాము విలువైన భూమి కోల్పోవాల్సి వస్తుందని యజమానులు ఆందోళన చెందుతున్నారు. వెంచర్ల అనుమతుల మంజూరులో అధికారులు నిబంధనలు పాటిస్తే ఈ పరిస్థితి తలెత్తేది కాదని భవన నిర్మాణదారులు వాపోతున్నారు. మున్సిపాలిటీగా మారే ములుగులో రానున్న రోజుల్లో ప్రభుత్వ నిబంధనలు భవన నిర్మాణదారులకు మరింత నష్టాన్ని చేకూర్చే విధంగా మారనున్నాయి.

పైప్‌లైన్ పనులను చేస్తున్న మిషన్ భగీరథ సిబ్బంది

మిషన్ భగీరథ పైప్‌లైన్‌కు మరమ్మతు

గణపురం, మార్చి 28 : మండలకేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాల ఎదురుగా మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీకాగా గురువారం అధికారులు మరమ్మతు చేశారు. ఈ నెల 26న 'నమస్తే తెలంగాణ'లో 'మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీ' శీర్షికన ప్రచురితమైన కథనానికి స్పందించిన అధికారులు మరమ్మతులు చేపట్టి మంచినీటి సరఫరాను క్రమబద్ధీకరించారు.

15న పీఏసీఎస్ చైర్మన్, వైస్ చైర్మన్‌పై అవిశ్వాసం

కాటారం, మార్చి 28 : గారెపల్లి (కే) పీఏసీఎస్ చైర్మన్ చల్లా నారాయణ రెడ్డి, వైస్ చైర్మన్ దబ్బెట స్వామిపై సభ్యులు అవిశ్వాసం పెట్టగా, ఏప్రిల్ 15న సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు డీసీవో శైలజ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు పాలకవర్గ సభ్యులకు నోటీసులు అందించారు. గతనెల 15న ఏడుగురు డైరెక్టర్లు అవిశ్వాసం ప్రకటించగా మార్చి 11న సమావేశం ఏర్పాటు చేయాలని గతంలో ఆదేశాలు వెలువడ్డాయి. చైర్మన్ నారాయణరెడ్డి మార్చి 6న హైకోర్టులో రిట్ పిటిషన్ వేయగా, 20 వరకు సమావేశాలు నిర్వహించకుండా మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో పలువురు డైరెక్టర్లు, సహకార శాఖ అధికారులు కౌంటర్ దాఖలు చేయగా ఉత్తర్వులను సవరిస్తూ సమావేశం నిర్వహించవచ్చని, తుది ఫలితాలను మాత్రం ఏప్రిల్ 24 వరకు వెల్లడించవద్దని హైకోర్టు ఈనెల 21న ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో ఏప్రిల్ 15న అవిశ్వాస తీర్మానానికి సమావేశం ఏర్పాటు చేశారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

టేకుమట్ల, మార్చి 28 : టేకుమట్ల– రాఘవరెడ్డిపేట చలివాగు, కలికోటపల్లి మానేరు వాగు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ఆరు ట్రాక్టర్లు, లోడింగ్ చేసే డోజర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు. డ్రైవర్లు, ఓనర్లు తుమ్మల సాగర్, అంకతి చందు, మచ్చ రాకేశ్, బందెల శివ, శ్రీకాంత్, ఉడుత అనిల్, తిప్పనవేణ రాజయ్య, బాలయ్య, సూరం సాగర్, అజ్మీరా రమేశ్‌పై కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. అక్రమంగా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు త